క్లుప్తంగా

విద్యార్థులకు భగవద్గీత పుస్తకాల పంపిణీ



గుడివాడ టౌన్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ముద్రించిన నేటి బాలలే రేపటి పౌరులు అనే అంశాన్ని పరిగణనలోకి తీసుకుని భగవద్గీత ప్రతులు మంగళవారం పంపిణీ చేశారు. స్థానిక విద్యాలయ ఇంగ్లిష్ మీడియం పాఠశాల్లో నిర్వహించిన కార్యక్రమంలో హిందూ ప్రచార సభ గుడివాడ ప్రతినిధి కావూరి శ్రీధర్ మాట్లాడుతూ భగవద్గీత అనే శీర్షికతో ముద్రించిన ఈ ప్రతులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విద్యాలయ డైరెక్టర్ బొప్పన విజయభాస్కర్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి



జమీగొల్వేపల్లి(పామర్రు): పీహెచ్‌సీలకు వచ్చే రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పీహెచ్‌సీలో ఉన్న రికార్డులను, రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమయ పాలన పాటిస్తూ రోగులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. గ్రామ సర్పంచ్ రాయవరపు శాంతకుమారి, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ వర ప్రసాద్, డాక్టర్ చరణ్‌చంద్ పాల్గొన్నారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ గంగాశ్రీదేవి పర్యవేక్షణ చేశారు.

దుస్తుల పంపిణీ



పామర్రు: కార్తిక మాసంలో పేదలకు వస్త్రాలను దానం చేస్తే వారి కుటుంబం సుభిక్షంగా ఉంటుందని శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానం ఈఓ పీవీఎస్‌వీ ప్రసాద్‌రావు అన్నారు. ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న ఆలయంలో దాతలు పేదలకు వస్త్రాలను మంగళవారం అందజేశారు. ఈఓ మాట్లాడుతూ ఉండ్రపూడికి చెందిన మండపాక కాశీ వర ప్రసాదరావు, వీరచంద్ర లక్ష్మీకుమారి, మండపాక చంద్రశేఖర్–దుర్గా స్రవంతి దంపతుల సౌజన్యంతో పేదలకు, బ్రాహ్మణులకు నూతన వస్త్రాలను దానంగా అందజేశారన్నారు. కార్యక్రమంలో అర్చకులు ఫణికుమార్, శర్మ, ఆలయసిబ్బంది శ్రీహరి పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



గుడివాడరూరల్: తుపాను హెచ్చరికల నేపథ్యంలో నియోజకవర్గంలోని రైతాంగం అప్రమత్తంగా ఉండాలని, అధికార యంత్రాంగం ముందస్తుగానే సహాయ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సూచించారు. ప్రజా వేదికలో వ్యవసాయశాఖ, రెవెన్యూ అధికారులతో ఎమ్మెల్యే మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం తుపాను ప్రభావం ఉన్న నేపథ్యంలో అధికారులు కార్యాలయాలకు పరిమితం కాకుండా రైతుల వద్దకు వెళ్లి వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఆదేశించారు. తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావు, వ్యవసాయశాఖ ఏడీఏ రమాదేవి, ఏఓలు పాల్గొన్నారు.

లక్ష రుద్రాక్షలతో అభిషేకం



మండవల్లి: మండవల్లిలో కొలువైన భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో లక్ష రుద్రాక్షలతో అభిషేకం మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, గణపతి హోమం నిర్వహించారు. అనంతరం శివనామస్మరణతో లక్ష రుద్రాక్షలతో స్వామికి అభిషేకాలు చేశారు. దేవదాయ శాఖ కార్యనిర్వాహణాధికారి కొవ్వాడ దివ్యశ్రీ ఏర్పాట్లు సమీక్షించారు.

మినుము విత్తనాలు ఇవ్వరా?

సమయం దాటుతోందని రైతుల ఆందోళన



కోతకు సిద్ధమైన వరి

పామర్రు: వరి పంట కోతదశకు చేరుకుంది. కొన్ని చోట్ల మిషన్‌సాయంతో నూర్పిళ్లు జరుగుతున్నాయి. అయినా ఇంత వరకు అధికారులు రబీ పంటకు సంబంధించి మినుము విత్తనాలు సరఫరా చేయకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి పంట కోతకు ముందే పొలంలో మినుము, పెసర విత్తనాలు చల్లాల్సి ఉంది. ఇంత వరకు అధికారులు పామర్రు మండలంలో మినుము విత్తనాలను పంపిణీ చేయని కారణంగా రైతులు అధిక మొత్తంలో దళారుల వద్ద నుంచి విత్తనాలు కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మార్కెట్‌లోనే కేజీ విత్తనం మినుము ధరలు రూ.100–150 వరకు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం మినుము బస్తా రేటు అధికమవటం కారణంగా ఈ రేటు మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నాయి.

90 వేల ఎకరాల్లో వరి సాగు

నియోజకవర్గంలో 90 వేల ఎకరాల వరకు వరి సాగు చేపట్టడం జరిగింది. దీనిలో ఇప్పటికే మిషన్లతో సుమారు 10 వేల ఎకరాల్లో వరి నూర్పిళ్లు పూర్తయ్యాయి. 70 వేల ఎకరాల వరి కోతకు, మిషన్ నూర్పిళ్లకు సిద్ధంగా ఉంది. మిగిలిన 10వేల ఎకరాల్లో వరి కోత దశలో ఉంది. ప్రభుత్వం సత్వరమే స్పందించి రైతులకు మినుము విత్తనాలను సరఫరా చేయాలని కోరుకుంటున్నారు.

విత్తనాల సరఫరా ఆలస్యంపై రైతుల ఆగ్రహం

మినుము విత్తనాలు ఇంత వరకు ప్రభుత్వం అందించక పోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమయంలో మినుము పంట వేస్తే జనవరి చివరి నాటికి పంట చేతికి వస్తుందని రైతులు చెబుతున్నారు. రైతులందరికీ ఒక్కసారిగా మినుము విత్తనాల అవసరం రావడంతో దళారులు కూడా విత్తనాల రేట్లను పెంచేసి, వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా పామర్రు మండలంలోని వ్యవసాయ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తి నట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మినుము విత్తనాలను సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మినుము విత్తనాలు వెంటనే ఇవ్వాలి



వరి కోతలు కోసే సమయానికి మినుము విత్తనాలు చల్లుతాం. అయితే ఇప్పటి వరకు విత్తనాలు సరఫరా చేయక పోవడం దారుణం. వాతావరణం ప్రతి కూల ప్రభావంతో వరి పంటను యంత్రాల సహాయంతో నూర్పిళ్లు చేస్తున్నాం. ఇటువంటి సమయంలో మినుము విత్తనాలను సత్వరమే సరఫరా చేయాలి.

– కె.పెదవెంకటరెడ్డి, రైతు పామర్రు

విత్తనాలు రాగానే సరఫరా చేస్తాం



రబీలో మినుము పంట విత్తనాలు కావాలని ఇండెంట్ పెట్టాం. ప్రభుత్వం నుంచి విత్తనాలు రాగానే వెంటనే రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. సత్వరమే పంపిణీ చేసే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– శివ నాగరాణి, ఏఓ, పామర్రు

ఉత్సాహంగా కార్తిక వన సమారాధన



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ మధుసూదన్‌రావు

నిమ్మకూరు(పామర్రు): మండలంలోని నిమ్మకూరు ఏపీ గురుకుల పాఠశాలలో మంగళవారం కార్తిక వనసమారాధన కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. చిన్నారుల ఆట పాటలతో సందడిగా సమారాధన సాగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మధుసూదనరావు మాట్లాడుతూ అందరం కలిసి సహపంక్తి భోజనాలు చేయటం వలన సమాన భావం ఏర్పడుతుందన్నారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో పలు రకాల మొక్కలను నాటారు.

నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో..



అతిథులను సన్మానిస్తున్న నాయీబ్రాహ్మణ సంఘ నాయకులు

పామర్రు: నాయీ బ్రాహ్మణ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ యార్డులో మంగళవారం కార్తిక వన సమారాధన కార్యక్రమం జరిగింది. తొలుత అసోసియేషన్ సభ్యులు ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథి రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి మాట్లాడుతూ సంఘ సభ్యులు అందరూ సంఘటితంగా ఉండాలన్నారు. నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, అసోసియేషన్ సభ్యులు ప్రసాద్, ప్రాకర్ల శివ పాల్గొన్నారు.

ఆర్డీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తల ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

గుడివాడ టౌన్: గుడివాడ డివిజన్ పరిధిలోని అంగన్‌వాడి కేంద్రాల్లో పనిచేయుటకు అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు ఇంటర్వ్యూలు నిష్పక్షపాతంగా జరిగాయని ఆర్డీఓ జి.బాలసుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ అధికారులతో కలిసి మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. అభ్యర్థుల విద్యార్హతలు, వారిలోని నైపుణ్యతను పరిగణనలోకి తీసుకుని నియామకాలు ఉంటాయన్నారు. ఐసీడీఎస్ పీడీ ఎస్. సువర్ణ, డాక్టర్ మధుసూదనరావు, సీడీపీఓ విజయ ఫ్లారెన్స్ పాల్గొన్నారు.


విధులు సక్రమంగా నిర్వహించాలి

ముదినేపల్లి రూరల్: నిబంధనల ప్రకారం ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ జేఎస్ సుభానీ పేర్కొన్నారు. స్థానిక వి.కన్వెన్షన్ హాల్లో నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల విధులకు సంబంధించిన పోలింగ్ సిబ్బందికి శిక్షణ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనీలు డీవీ నాగేశ్వరరావు, మారుతీ ఎన్నికల ప్రక్రియను సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో నీటి పారుదల శాఖ ఏఈలు పాల్గొన్నారు.



దీపోత్సవంలో పాల్గొన్న ఈఓ కొండలరావు దంపతులు

ఘనంగా సహస్ర దీపార్చన



శివ లింగాకారంలో దీపార్చన

గుడ్లవల్లేరు: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని శ్రీ కొండలమ్మ అమ్మవారి దత్తత దేవస్థానం రెడ్డిపాలెం శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి సహస్ర దీపార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళా భక్తులు దీపార్చన చేసేందుకు ఆలయ ఈఓ ఆకుల కొండలరావు ఏర్పాట్లు చేశారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి ఈ దీపోత్సవంలో పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

సంక్షిప్త వార్తలు

క్రీస్తు మార్గం ఆచరణీయం



గుడ్లవల్లేరు: దీన జనులకు మేలు చేయాలనే ఏసుక్రీస్తు చూపిన మార్గం ఆచరణీయమని రెవరెండ్ పిన్‌హెజ్ అన్నారు. అంగలూరు సీఎస్ఐ చర్చిలో రెవరెండ్ గోత్రు సాల్మన్ ఆధ్వర్యంలో జరిగిన సెమీ క్రిస్మస్‌కు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. అనంతరం ఏసు విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఘనంగా అడుసుమిల్లి జయంతి



గుడ్లవల్లేరు : స్థానిక ఏఏఎస్ఎం అండ్ వీవీఆర్ ఎస్ఆర్ విద్యా సంస్థల వ్యవస్థాపకుడు స్వర్గీయ అడుసుమిల్లి అశ్వర్థనారాయణమూర్తి జయంతి వేడుకలు స్థానిక పాలిటెక్నిక్ కాలేజీలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయనతో పాటు వల్లూరుపల్లి వెంకట రామ శేషాద్రిరావు విగ్రహాలకు నివాళులర్పించారు. వృద్ధులకు వస్త్రాలు, విద్యార్థులకు ఉపకార వేతనాలను విద్యా సంస్థల కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణ, సహ కార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ అందించారు. ట్రస్టీలు కొడాలి కృష్ణారావు, వల్లభనేని సుబ్బారావు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం

ముదినేపల్లి: లోక్ అదాలత్‌ల ద్వారా కక్షిదారులు సత్వర న్యాయం పొందవచ్చని కైకలూరు రూరల్ సీఐ రవికుమార్, ఎస్ఐ వీరభద్రరావు అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం జాతీయ లోక్ అదాలత్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ న్యాయస్థానాల్లో పేరుకుపోతున్న కేసుల వల్ల తీర్పులు వెలువడేందుకు జాప్యం ఏర్పడుతోందన్నారు. దీనివల్ల కక్షిదారులకు సమయం, ధనం వృథా అవుతోందన్నారు. ఈ పరిస్థితిని నివారించేందుకు ఏర్పాటు చేసిన లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సీఐ కోరారు.

వస్త్రదానం



గుడివాడ టౌన్: కార్తిక మాసం బహుళ ఏకాదశిని పురస్కరించుకుని పేద బ్రాహ్మణులకు వస్త్రాలు వితరణగా ఇచ్చినట్లు భీమేశ్వర స్వామి దేవస్థానం ఈఓ కె.వేణుగోపాలరావు తెలిపారు. మంగళవారం స్థానిక దేవరకొండ నాగన్న బ్రాహ్మణ అన్నదాన సత్రంతో ఈ కార్యక్రమం నిర్వహించారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



పామర్రు: కాకినాడలో విద్యాశాఖ నిర్వహించిన జోనల్ స్థాయి వ్యాసరచన పోటీల్లో తమ హైస్కూల్ విద్యార్థిని ప్రతిభ కనబర్చి విజేతగా నిలిచిందని ఏఎస్ఎం ప్రిన్సిపాల్ ఏ పూర్ణచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక యలమర్రురోడ్డులోని ఏఎస్ఎం హైస్కూల్ విజేత అయిన విద్యార్థినిని మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో తమ హైస్కూల్ పదో తరగతి విద్యార్థినీ జీ దినేషప్రియ జోనల్ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



గుడివాడలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించిన ఎంపీపీ, ఎంపీడీఓ, అధికారులు



పామర్రు మాజీ ఎమ్మెల్యే కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



కైకలూరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గుడివాడరూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని ఎంపీపీ గద్దే పుష్పరాణి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం భారత రాజ్యాంగం ఆమోద దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీపీ అధికారులతో కలసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ విష్ణుప్రసాద్, ఈఓపీఆర్డీ జి.శ్రీనివాసరావు, వెలుగు ఏపీఎం ప్రసాద్ పాల్గొన్నారు.

పామర్రులో..

పామర్రు: మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ కార్యాలయంలో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు కె స్వరూపరాణి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసరావు, మహేష్, నాయ కులు శ్రీనాథ్‌రెడ్డి, నాని, సుబ్రమణ్యం, అశోక్ పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్

గుడివాడరూరల్: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని, నేటి యువత ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. పట్టణంలోని ఏలూరురోడ్‌లోని ప్రజావేదికలో రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. మాజీ ఐఎఫ్ఎస్ అధి కారి కాకొల్లు బస్మాకరరావు, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, నందివాడ మండల టీడీపీ అధ్యక్షుడు సన్యాసిరావు పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా తాలూకా సెంటర్‌లో మంగళవారం అంబేడ్కర్ విగ్రహానికి పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దూలం వినయ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు సాధు కొండయ్య, పట్టపు బాలమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు ఉచ్చుల చిన్ని రాజు, షేక్ రఫీ, మండల కో–ఆప్షన్ సభ్యులు శ్యాంసుందర్, రామారావు, నాగరాజు, మహేష్, ఏసుకుమార్, రాము, నాగు, లాజర్, రాజు, ఫిర్దోస్ ఖాన్ పాల్గొన్నారు. అదేవిధంగా కైకలూరు తాలూకా సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, టీడీపీ మండలాధ్యక్షుడు పెన్మత్స త్రినాథరాజు నివాళులర్పించారు. ఎండీ.జానీ, వీరాబత్తిన సుధా, పాట్రిక్‌పాల్, గడిదేశి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కలిదిండి సెంటర్‌లో దళిత నాయకులు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.

పాఠశాలల్లో ..

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. పెయ్యేరు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు బేతాల రాజేంద్రప్రసాద్, సీహెచ్ చక్రధర్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు నిమ్మగడ్డ భిక్షాలు ఆధ్వర్యంలో గ్రామంలోని అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.

కానుకొల్లు హైస్కూల్లో..

మండవల్లి: కానుకొల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని హెచ్ఎం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకే రంగు దుస్తులు ధరించి రాజ్యాంగానికి వందనం సమర్పించడం ఆకట్టుకుంది.

మండవల్లి: రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవలసిన బాధ్యత ప్రజలందరిపై ఉందని అంబేడ్కర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు పేర్కొన్నారు. మండవల్లిలో బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు.

దేవరపల్లిలో..

పామర్రు(తోట్లవల్లూరు): విద్యార్థులు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగి దేశం గర్వించేలా ఉండాలని ఎంఈఓ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. తోట్లవల్లూరు మండలం దేవరపల్లి జెడ్పీ హైస్కూల్లో బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. బహుజన టీచర్స్ అసోసియేషన్ కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టా రాజేష్, పాఠశాల హెచ్ఎం రామకృష్ణ, పంచాయతీ సెక్రటరీ రవికుమార్ పాల్గొన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ జి.బాల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అదేవిధంగా స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నాయకులు ఆవిర్భావ దినోత్సవాన్ని జరిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, అధికార ప్రతినిధి ఎంవీ నారాయణరెడ్డి, వెంపటి సైమన్, శేఖర్, అంజనేయ ప్రసాద్, కర్రే నాని, తుకల్లూరి ప్రశాంత్, లంకపల్లి జర్మియ పాల్గొన్నారు. స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజనీరింగ్ కళాశాలలో ఆవిష్కరణ దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ప్రిన్సిపాల్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు పాల్గొన్నారు. స్థానిక ఏఎన్నార్ కళాశాల్లో నిర్వహించిన ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, కరస్పాండెంట్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ పాల్గొన్నారు.



కానుకొల్లు హైస్కూల్లో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా వందనం సమర్పిస్తున్న విద్యార్థులు



దేవరపల్లిలో 75 అంకె రూపంలో విద్యార్థుల సమాహారం



గుడివాడలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: పెంజెండ్ర జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవ వేడుకలు జరిగాయి. మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు రాజ్యాంగంపై అవగాహన కల్పించారు. లయన్స్ చైర్మన్ శశికళ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కరెన్సీ, నాణేల ప్రదర్శన

కలిదిండి మండలం చినతాడినాడ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో సాంఘిక శాస్త్ర దినోత్సవం, రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు 100 ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శించారు. ఉపాధ్యాయుడు జి.మాల్యాద్రి కరెన్సీ, నాణేల ప్రదర్శన ఆకట్టుకుంది.

ముదినేపల్లి రూరల్: ప్రపంచంలోనే భారత రాజ్యాంగం అత్యుత్తమమైనదని ఎంపీడీఓ వై రామకృష్ణ అన్నారు. స్థానిక స్పామ్ ఐటీఐ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం వలంటీర్ల ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు.

నేడు శంఖారావం సన్నాహక సభ

ముదినేపల్లి రూరల్: హైందవ శంఖారావం సభకు సంబంధించి సన్నాహక సమావేశాన్ని ముదినేపల్లిలో బుధవారం నిర్వహించనున్నట్లు బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కీర్తి వెంకటరాంప్రసాద్ మంగళవారం తెలిపారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో 2025 జనవరి 5న విజయవాడలో హైందవ శంఖారావం సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి సన్నాహక సమావేశాన్ని సింగరాయపాలెం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి హిందువులు, మాలాధారులు, వినాయక ఉత్సవ కమిటీ, ఆలయాల కమిటీల బాధ్యులు సన్నాహక సమావేశానికి హాజరువాలని కోరారు.

బెల్ట్ షాపు నిర్వాహకుల బైండోవర్

నందివాడ: నందివాడ మండలం జనార్దనపురం, రుద్రపాక, దండిగనపూడిలో అక్రమ మద్యం నిర్వహిస్తూ గతంలో పట్టుబడిన పసుపులేటి సోమయ్య, సీతారామరెడ్డి, జల్లి అమర్, మాటూరి జగన్మోహన్‌రావును మంగళవారం తహసీల్దార్ ఎదుట హాజరు పరచి బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.ఆశాలత మాట్లాడుతూ మండల పరిసర ప్రాంతాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.